# చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి... విశ్లేషణ

**చిన్న తరహా పరిశ్రమలు, చిన్న తరహా వ్యాపారానికి దక్షిణాసియా ప్రాంతం ప్రఖ్యాతి గాంచింది. భారత్, పాకిస్థాన్, శ్రీలంక దేశాల్లో ఈ తరహా పరిశ్రమలను ప్రోత్సహించే ఉద్దేశంతో అనేక విధానపరమైన సంస్కరణలు, రాయితీలను ప్రకటిస్తున్నాయి. అయినప్పటికీ ఈ పరిశ్రమల అభివృద్ధిలో అనేక అవరోధాలు ఏర్పడుతున్నాయి. ఉత్పత్తి, ఉత్పత్తి కారకాల మార్కెట్‌కు సంబంధించి, సంస్థాపరమైన మద్దతు విషయంలో చిన్న, మధ్య తరహా సంస్థలు, ఆయా దేశాలు అనుసరిస్తున్న చర్యలు ఈ పరిశ్రమ అభివృద్ధికి ఆటంకంగా మారాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం, తదనుగుణంగా శిక్షణ సౌకర్యాలను కల్పించడం వంటి చర్యల ద్వారా చిన్న తరహా పరిశ్రమల పురోగతికి ఆయా దేశాల్లోని ప్రభుత్వాలు చేయూతనివ్వాలి.**

ఒక దేశ పారిశ్రామికాభివృద్ధి, ఆర్థిక వృద్ధి, ఆదాయ పంపిణీలో చిన్నతరహా పరిశ్రమల పాత్ర కీలకమైంది. మన దేశంలో మూలధన సమీకరణ, ఉద్యోగిత కల్పన, పరిశ్రమల వికేంద్రీకరణ, ప్రాంతీయ అసమానతల తొలగింపులో చిన్న, మధ్య తరహా సంస్థలు గణనీయమైన పాత్ర పోషించాయి.

రవాణా వంటి మౌలిక సౌకర్యాలు కొన్ని ప్రాంతాల్లోనే కేంద్రీకృతం కావడంతో సంబంధిత పరిశ్రమలు కూడా కొన్ని ప్రాంతాల్లోనే విస్తరించాయి. అఖిల భారత పరిశ్రమల అసోసియేషన్ విడుదల చేసిన నివేదిక ప్రకారం.. తయారీ ఉత్పత్తుల మొత్తం విలువలో 40 శాతం; మొత్తం దేశీయ ఎగుమతుల్లో 34 శాతం; మొత్తం స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 7 శాతం వాటా చిన్నతరహా పరిశ్రమల ద్వారానే సమకూరుతోంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నివేదిక 2007 ప్రకారం.. దేశంలో చిన్న తరహా పరిశ్రమల మొత్తం యూనిట్లు 123 లక్షలు. వీటి ద్వారా 295 లక్షల మందికి ఉపాధి లభించింది. మొత్తం ఈ యూనిట్లలో పెట్టుబడి రూ.1,88,113 కోట్లు. కాగా 2000-06 మధ్య కాలంలో ఈ పరిశ్రమలో తయారైన మొత్తం ఉత్పత్తి విలువ రూ.4,71,244 కోట్లు.

గత ఆరు దశాబ్దాలుగా భారత పారిశ్రామిక విధానంలో భాగంగా చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధికి తగిన ప్రాధాన్యం ఇచ్చారు. కాలానుగుణంగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పారిశ్రామిక విధానాలను పరిశీలించినప్పుడు ఈ విషయం స్పష్టమవుతోంది. ఈ విధానాల్లో చిన్న తరహా పరిశ్రమల వృద్ధి, అందుకు ప్రభుత్వ మద్దతుకు సంబంధించి తీసుకున్న నిర్ణయాలు, నియంత్రణ చర్యలు ప్రధాన పాత్ర పోషించాయి. 1955లో ఏర్పాటైన కార్వే కమిటీ ఈ పరిశ్రమల అభివృద్ధి కొన్ని చర్యలను సూచించింది. అందులో భాగంగా కొన్ని ఉత్పత్తుల రిజర్వే షన్, ప్రభుత్వం కొనుగోలు చేయాల్సిన వస్తువులను ఈ పరిశ్రమల నుంచే కొనుగోలు చేయాలన్న సిఫార్సులు చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధికి ఇతోధికంగా దోహదం చేశాయి.

### సంస్కరణల యుగం:

1980 దశకం మొదటి నుంచి ఆర్థిక వ్యవస్థలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 'మార్కెట్ ఆధారిత వ్యవస్థ'గా రూపొందింది. సమాచార విప్లవం, ఇంటర్నెట్ సౌకర్యాలు ప్రజలకు మరింత చేరువయ్యాయి. ప్రత్యామ్నాయ వస్తువుల లభ్యత, ధరలు, ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తులలో చోటుచేసుకుంటున్న నవకల్పనలు (ఆధునికీకరణ) వంటి వాటి కారణంగా చిన్న తరహా పరిశ్రమలు పెద్ద ఎత్తున పోటీ ఎదుర్కొంటున్నాయి. 1995లో ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) ఏర్పాటైన తర్వాత దేశాల మధ్య ఉన్న వాణిజ్య అడ్డంకులు తొలిగాయి. అనేక దేశాలు కొన్ని ఉత్పత్తుల దిగుమతులపై విధించిన ఆంక్షలను సడలించాయి. డబ్ల్యూటీఓ లక్ష్యాలకు అనుగుణంగా భారత్ కూడా దిగుమతి సుంకాలను తగ్గించింది.

### పారిశ్రామిక తీర్మానం 1991

కేంద్ర ప్రభుత్వం పారిశ్రామిక లైసెన్సింగ్, విదేశీ పెట్టుబడి, విదేశీ సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన ఒప్పందాలు, ప్రభుత్వ రంగ విధానం, ఏకస్వామ్యాల నియంత్రణ చట్టానికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అన్ని ప్రాజెక్టులకు సంబంధించి పారిశ్రామిక లైసెన్సింగ్ రద్దు, అన్ని రిజిస్ట్రేషన్ స్కీముల రద్దు, ప్రభుత్వ రంగాన్ని కొన్ని పరిశ్రమలకే పరిమితం చేయడం, దిగుమతుల విధానం సరళీకృతం చేయడంతోపాటు దిగుమతులపై అన్ని పరిమాణాత్మక ఆంక్షలను తొలగించింది. పారిశ్రామిక అభివృద్ధికి సంబంధించి ఇంతకుముందు ఉన్న విధానాలన్నింటినీ సరళతరం చేసింది. చిన్న తరహా పరిశ్రమలకు ప్రత్యేకంగా విదేశీ పెట్టుబడులను అనుమతించడంతోపాటు పెద్ద పారిశ్రామిక సంస్థల విస్తరణ, బహుళ జాతి సంస్థల ప్రవేశానికి అనుమతినిచ్చింది. చిన్నతరహా పరిశ్రమ అభివృద్ధి కోసం అమలు చేయాల్సిన అన్ని రకాల ప్రోత్సాహక విధానాలను ప్రభుత్వం విరమించుకుంది.

### సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల అభివృద్ధి చట్టం- 2006

ఈ చట్టం అమలులోకి వచ్చే ముందు.. సాధారణంగా స్మాల్ స్కేల్ అనే పదాన్ని వివరించడానికి 'చిన్న తరహా పరిశ్రమ' అని పేర్కొన్నారు. అక్టోబర్ 2, 2006 నుంచి ఈ చట్టం అమలులోకి వచ్చింది.

ప్రపంచ విధానాలకు అనుగుణంగా 'స్మాల్ స్కేల్' అనే పదాన్ని 'చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్'గా మార్చారు.

## ఇందులోని ముఖ్యాంశాలు:

1. సేవలను కూడా చేర్చే ఉద్దేశంతో 'పరిశ్రమ' అనే పదాన్ని 'ఎంటర్ ప్రైజెస్'గా మార్చారు.
2. తయారీ, సేవల ఎంటర్‌ప్రైజెస్‌కనుగుణంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను వర్గీకరించడానికి పెట్టుబడి పరిమితిని విధించారు. 2006లో తయారీ సూక్ష్మ సంస్థల పెట్టుబడి పరిమితి రూ. 2.50 మిలియన్లు, సేవల సూక్ష్మ సంస్థలకు రూ. 50 మిలియన్లు, సేవలకు సంబంధించి రూ.20 మిలియన్లు పెట్టుబడి పరిమితి. కాగా మధ్య తరహా తయారీ సంస్థలకు రూ.100 మిలియన్‌లు సేవా సంస్థలకు రూ.50 మిలి యన్ల పరిమితిగా నిర్ణయించారు.

## సంస్థాపరమైన మద్దతు

సాంకేతిక పరిజ్ఞానం, ఆధునికీకరణ, నాణ్యత పెంపుతో పాటు సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం కోసం 'ఆఫీస్ ఆఫ్ డవలప్‌మెంట్ కమిషనర్' (ఎస్ఎస్ఐ) ప్రత్యేక సేవలందిస్తోంది. 1954లో ఏర్పాటు చేసిన చిన్న తరహా పరిశ్రమల ఆర్గనైజేషన్ (ఎస్ఐడీఓ) వివిధ ప్రాజెక్టుల అభివృద్ధి, టూల్ రూమ్స్, శిక్షణ సంస్థల ఏర్పాటు, ఆర్థిక సహాయం అందించడానికి అవసరమైన ఏర్పాట్లపై దృష్టి సారించడంతోపాటు ఆయా సంస్థలు తయారు చేసిన ఉత్పత్తుల మార్కెటింగ్, ఇతర మౌలిక సౌకర్యాల అభివృద్ధి కోసం కృషిచేస్తోంది. 28 చిన్న తరహా పరిశ్రమల సర్వీస్ ఇన్‌స్టిట్యూట్ల ద్వారా ఈ పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన'కన్సల్టెన్సీ సర్వీసులు'అందిస్తున్నారు.

చిన్నతరహా పరిశ్రమల్లో పనిచేసే శ్రామికులు, సాంకేతిక నిపుణులకు కావాల్సిన శిక్షణను అందించడం కోసం 42 వర్క్‌షాపులు ఏర్పాటు చేశారు. మేనేజ్‌మెంట్ శిక్షణా నైపుణ్యాన్ని పెంపొందించడానికి 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, స్మాల్ బిజినెస్ డవలప్‌మెంట్', 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్మాల్ ఇండస్ట్రీ ఎక్స్‌టెన్షన్ అండ్ ట్రైనింగ్' స్థాపించారు. ప్రమోషనల్ సర్వీసులను అందించడానికి 4 ప్రాంతీయ టెస్టింగ్ సెంటర్లు, 8 ఫీల్డ్ టెస్టింగ్ స్టేషన్లు, 10 టూల్ రూమ్స్ ఏర్పాటు చేశారు. కేంద్ర స్థాయిలో ఈ పరిశ్రమల అభివృద్ధికి 'జాతీయ చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్'ను స్థాపించారు.

చిన్న తరహా పరిశ్రమలకు తగిన ఆర్థిక సహాయాన్ని అందించేందుకు వీలుగా అనేక సంస్థలు ఏర్పాటయ్యాయి. చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి బ్యాంక్ (సిడ్బీ), రాష్ట్ర స్థాయిలో ఆర్థిక కార్పొరేషన్లు, జాతీయ చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని బ్యాంకులతోపాటు సహకార బ్యాంకులు వీటి అభివృద్ధి కోసం పరపతి సౌకర్యాన్ని అందిస్తున్నాయి. రాష్ట్రస్థాయిలో డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్, జిల్లా పారిశ్రామిక కేంద్రాలు, రాష్ట్ర ఆర్థిక కార్పొరేషన్, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి కార్పొరేషన్, రాష్ట్ర చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్లు ఈ పరిశ్రమల అభివృద్ధికి ఇతోధికంగా దోహదం చేశాయి. చిన్న తరహా ప్లాంట్‌ల ఏర్పాటు కోసం స్థల ఎంపిక, ముడి సరుకులతోపాటు, యంత్ర పరికరాలు, ఉత్పత్తుల మార్కెటింగ్‌కు అవసరమైన కన్సల్టెన్సీ సర్వీసులను జిల్లా పారిశ్రామిక కేంద్రాలు అందిస్తున్నాయి. పారిశ్రామికవాడల ఏర్పాటుతోపాటు ఇతర మౌలిక సౌకర్యాలు అందించడానికి చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ సహాయపడుతుంది.

## పాకిస్థాన్‌లో చిన్న, మధ్య తరహా సంస్థలు:

పాకిస్థాన్‌కు చెందిన పారిశ్రామిక, వాణిజ్య సంస్థల్లో 90 శాతం చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్‌కు సంబంధించినవే. అంతేకాకుండా ఈ పరిశ్రమ అభివృద్ధికి ఆ దేశ ఆర్థిక వ్యవస్థ సానుకూల వాతావరణాన్ని (ప్రొటెన్షియాలిటీ) కల్పించింది. స్వాతంత్ర్యానంతరం మొదట్లో వాణిజ్య ప్రోత్సాహం ప్రభుత్వ రంగంలోని పెద్ద తరహా సంస్థలకే లభించింది. ఆర్థిక పరమైన ఒడిదుడుకులు; పన్ను విధానాలు; శాంతి భద్రత(లా అండ్ ఆర్డర్) సమస్యలు; సంస్థాపరమైన సమస్యలు; రాజకీయ అనిశ్చితి; శ్రామికుల్లో నైపుణ్యం తక్కువగా ఉండటం; తక్కువ నాణ్యతతో కూడుకున్న ఉత్పత్తులు చిన్న, మధ్య తరహా సంస్థల అభివృద్ధిలో ఎదురవుతున్న సమస్యలుగా పేర్కొనవచ్చు. ప్రభుత్వ ఏజె న్సీలైన 'చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ అభివృద్ధి అథారిటీ', స్టేట్ బ్యాంక్ ఆఫ్ పాకిస్థాన్ ఈ పరిశ్రమల అభివృద్ధికి చేయూతనిచ్చాయి. 65 శాతం ఎంటర్‌ప్రైజెస్ పంజాబ్ ప్రాంతంలోనూ, 18 శాతం సింధ్ ప్రాంతంలో, 3 శాతం బెలూచిస్థాన్, ఇస్లామాబాద్‌లలో, 14 శాతం ఉత్తర పశ్చిమ ప్రావిన్స్‌లో కేంద్రీకృతమయ్యాయి. మొత్తం సంస్థల్లో 53 శాతం హోల్‌సేల్, రిటైల్, రెస్టారెంట్లు, హోటళ్లు కాగా.. 22 శాతం కమ్యూనిటీ, సాంఘిక, వ్యక్తిగత సేవలకు సంబంధించినవి. 20 శాతం తయారీ రంగంలో ఏర్పాటయ్యాయి. మొత్తం ఎంటర్‌ప్రైజెస్‌లో 96 శాతం 5 కంటే తక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. మొత్తం సంస్థల్లో 90 శాతం 20ఏళ్లకు పైగా అనుభవం ఉన్నవే. మొత్తం సంస్థల్లో 43 శాతం టెక్స్‌టైల్స్, లెదర్ సంస్థలు. కాగా 20 శాతం పొగాకు, ఆహార ఉత్పతులు, 10 శాతం చెక్క, చెక్క తయారీ ఉత్పత్తులు, 10 శాతం లోహ ఉత్పత్తులు, 8 శాతం హస్తకళా ఉత్పత్తుల్లో నిమగ్నమయ్యాయి.

## శ్రీలంకలో చిన్న, మధ్య తరహా సంస్థలు:

శ్రీలంకలో చిన్న, మధ్య తరహా సంస్థలు వ్యవసాయం, మైనింగ్, ఫిషరీస్, నిర్మాణ రంగం, తయారీ ఉత్పత్తులు, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పర్యాటక సేవలలో నిమగ్నమయ్యాయి. ఎక్కువ శాతం సంస్థలను ఒక వ్యక్తి లేదా కొంత మంది కుటుంబ సభ్యులు ముఖ్యంగా బంధువులు, స్నేహితులు లేదా వ్యాపార భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నారు. అసంఘటిత రంగంలోని స్మాల్, మీడియం ఎంటర్ ప్రైజెస్ (ఎస్ఎంఈ)లో అల్ప ఉత్పాదకత, అల్పాదాయం లక్షణంగా కనిపిస్తోంది. చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో ఎక్కువ పశ్చిమ

ప్రావిన్స్ జిల్లాల్లో కేంద్రీకృతమ య్యాయి. కొలంబో జిల్లాలో 10 శాతం, గంపహా జిల్లాలో 13 శాతం సంస్థలు కేంద్రీకృతమయ్యాయి. శ్రీలంక కేంద్ర బ్యాంకు నివేదిక ప్రకారం.. 80 శాతం పరిశ్రమలు పశ్చిమ ప్రావిన్స్‌లో ఏర్పాటు కాగా ఉత్తర ప్రావిన్స్ జిల్లాలైన జాఫ్నా, మన్నార్, వావునియా, మలతీవు, కిలినోచ్చిలలో వీటి అభివృద్ధి తక్కువగా ఉంది. అంతర్జాతీయ శ్రామిక సంస్థ నివేదిక ప్రకారం శ్రీలంకలో 75 శాతం శ్రామిక శక్తి ఎస్ఎంఈలపై ఆధారపడింది. మొత్తం పరిశ్రమల్లో 85 శాతం చిన్న తరహా, 12 శాతం మధ్య తరహా, 3 శాతం పెద్ద తరహా సంస్థలు . మొత్తం పారిశ్రామిక సంస్థల్లో 96 శాతం ఎస్ఎంఈలు ఉన్నప్పటికీ పెద్ద తరహా సంస్థలతో పోల్చినపుడు మొత్తం ఉత్పత్తి విలువలో 80 శాతం వాటా పెద్ద తరహా సంస్థలదే. ఎస్ఎంఈలలో ఎక్కువగా ఆహార ఉత్పత్తులు, మైనింగ్‌కు సంబంధించినవి. శ్రీలంకలో చిన్న తరహా సంస్థల ద్వారా 2,85,623 మందికి ఉపాధి లభిస్తుండగా.. మధ్య, పెద్ద తరహా సంస్థలు 7,47,828 మందికి ఉపాధి కల్పిస్తున్నాయి.